


www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 19 | జనవరి | 2026 పేజీలు : 8

# కదం తొక్కిన కామ్రేడ్స్

- ఎర్రబారిన ఖమ్మం
- ఎటు చూసినా అరుణ పతాక రెపరెపలే
- నభూతో నా భవిష్యత్తులా జనసేవాదళ్ కవాత్
- ఆకట్టుకున్న కళారూపాలు

















**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ సందర్భంగా ఖమ్మంలో కామ్రేడ్స్ కదం తొక్కారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలతో ఖమ్మం పుర వీధులు కిటకిటలాడాయి. ప్రతి ఒక్కరూ అరుణ పతాకాన్ని చేతబూని ఎర్రని వస్త్రాలు ధరించి ఖమ్మంకు తరలి రావడంతో ఖమ్మం ఎర్రబారింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే సుదూర ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు ఖమ్మం చేరుకున్నారు. నాగపూర్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి కూడా పార్టీ కార్యకర్తలు సభకు హాజరయ్యారు. ఖమ్మం నగరం లోని ప్రధాన రహదారులన్ని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల రాకతో దిగ్బంధించబడ్డాయి. ఎటు చూసినా అరుణ పతాక రెపరెపలే కనిపించాయి. ఖమ్మం నగరంలోకి చేరుకునేందుకు ట్రాఫిక్ జామ్ కావడంతో కిలో మీటర్ల కొద్ది నడిచి కార్యకర్తలు ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలికి చేరుకున్నారు. వందలాది వాహనాల్లో పార్టీ కార్యకర్తలు తరలి రావడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మిగతా 2లో..

## విద్య-వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

- నర్సింగ్ కళాశాలలో జపనీస్, జర్మన్ భాషలు నేర్పేందుకు చర్యలు
- తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి సీఎం రేవంత్‌రెడ్డి
- 108కోట్ల60లక్షలతో నిర్మించే జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు శంకుస్థాపన
- 162కోట్ల54 లక్షలతో మున్నేరు నుండి పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి శంకుస్థాపన
- 25 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు ప్రారంభోత్సవం
- 19కోట్ల90లక్షల50వేలతో నిర్మించిన వ్యవసాయం మార్కెట్ యార్డ్ ప్రారంభోత్సవం





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** విద్య వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిలా ఇంచార్జి మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, హౌజింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ ఘనస్వాగతం పలికారు.

మిగతా 2లో..

# కదం తొక్కిన కామ్రేడ్స్

















**(మొదటిపేజీ తరువాయి)**

పెద్ద సంఖ్యలో యువత తరలి రావడం విశేషం. జనసేవాదళ్ కార్యకర్తలే కాకుండా బహిరంగ సభకు వచ్చిన వారిలో యువత ఎక్కువగా ఉన్నారు. క్రమ శిక్షణగా మూడు కిలో మీటర్ల మేర నడిచి బహిరంగ సభా స్థలికి చేరుకున్న యువత నాయకుల ఉపన్యాసాలకు, ప్రజానాట్యమండలి పాటలకు అలిసి పోకుండా కేరింతలు కొట్టారు. వందేమాతరం శ్రీనివాస్ అలపించిన ఎర్రజెండా ఎర్రజెండా ఎన్నియాల్లో పాటకు యువత ఊగిపోయింది. పూనకం వచ్చినట్లుగా బహిరంగ సభా స్థలి మొత్తం అరుణ పతాకాలను ఊపుతూ ఒక సరికొత్త వాతావరణాన్ని సృష్టించారు. యువత ఊపు చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఒక్కింత ఆశ్చర్య పోయారు. యువత హాజరైన తీరు చూస్తుంటే వందేళ్లు కాదు మరో వందేళ్లయినా సమ సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం కోసం పోరాడతామన్న భావన స్ఫురిచింది. వందేళ్ల ఉత్సవాలు చూడాలని వందల కిలో మీటర్ల మేర ప్రయాణించి 70 నుంచి 80ఏళ్లు పైబడిన వృద్ధులు, గతంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసినా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నాయకత్వం సభకు హాజరయ్యారు.

### మూడు ప్రదర్శనలు - వేల మంది జనం :

బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంలో మూడు ప్రదర్శనలు నిర్వహించారు. మొదటి ప్రదర్శన పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జనసేవాదళ్ కార్యకర్తలు ఖమ్మం పుర వీధుల్లో కదం తొక్కారు. వరుసుకు నలుగురు చొప్పున నిలబడిన ప్రదర్శన రెండు కిలో మీటర్ల మేర ఉండడంతో ప్రదర్శనను పెద్ద సంఖ్యలో నగర పౌరులు తిలకించారు. ముఖ్యంగా యువ మహిళల కవాతు ఆకట్టుకుంది. చిన్నారులు కదం తొక్కుతూ లెఫ్ట్ రైట్ అంటూ నడుస్తూ ఉత్తేజాన్ని ఇచ్చారు. పదేళ్ల లోపు బాలలు సైతం ప్రదర్శనలో పాల్గొని భవిష్యత్తు తరం మాదేనంటూ మరో వందేళ్లయినా కమ్యూనిస్టు పార్టీకి ఢోకా లేదని తమ కవాతుతో నిరూపించారు. జనసేవాదళ్ కార్యకర్తల కవాతుకు సిపిఐ అగ్ర నేతలు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, గుజ్జుల ఈశ్వరయ్య, చాడ వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం, బాగం హేమంతరావు తదితరులు నేతృత్వం వహించారు. జనసేవాదళ్ కార్యకర్తల తర్వాత సింగరేణి కార్మికులు, యువ మహిళలు, పర్ష పద్మ నేతృత్వంలో నాగళ్లు చేతబూనిన రైతులు కోయ, లంబాడ, జానపద నృత్య కళాకారులు, వందలాది మంది డప్పు కళాకారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. బతుకమ్మలతో మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆ తర్వాత న్యాయవాదులు, వైద్యులు, యువజన, విద్యార్థి సమాఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఇటీవల కాలంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని రీతిలో ప్రదర్శన సాగింది. ఖమ్మం నయాబజర్ కళాశాల నుండి మరో ప్రదర్శన ప్రారంభమైంది. నయాబజార్ కళాశాల నుండి ప్రారంభమైన ప్రదర్శన మయూరిసెంటర్, జెడ్పి సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సభా స్థలికి చేరుకుంది. ఈ ప్రదర్శనకు రాష్ట్ర సహయ కార్యదర్శి తకెళ్లపల్లి శ్రీనివాసరావు, బోస్, కె. శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు నేతృత్వం వహించారు. మూడవ ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైంది. శ్రీశ్రీ విగ్రహం నుంచి రోటరీ నగర్, మమత రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సభా స్థలికి చేరుకుంది. జాతీయ సమితి సభ్యులు ఎస్‌కె సాబీర్‌పాషా, సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు నేతృత్వం వహించారు.

### ఉత్తేజాన్ని ఇచ్చిన సభ :

సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగిన బహిరంగ సభ పార్టీకి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. భవిష్యత్తు పోరాటాలకు ఊపునిచ్చింది. వందేళ్లయినా నవ యవ్వనిలా మరో పోరాటానికి సిద్ధం కండి అంటూ కార్యకర్తలను పురిగోల్పే రీతిలో సభ జరిగింది. పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలు నేతల ఉపన్యాసాలకు తగు రీతిలో స్పందించారు. సిపిఐ నేతల ఉపన్యాసాలు యువతకు దిశా నిర్దేశం చేశాయి. దశాబ్ద కాలంలో ఖమ్మంలో ఇంతటి బహిరంగ సభ జరగకపోవడం, సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అతి పెద్ద బహిరంగ సభ జరగడం నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. ఇతర పార్టీల నేతలు సైతం అబ్బురపడే రీతిలో జన కదలికలు కనిపించాయి.

# విద్య-వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

**(మొదటిపేజీ తరువాయి)**

తొలుత సీఎం, మంత్రులతో కలిసి పాలేరునియోజకవర్గ పరిధి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 108కోట్ల60లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నూతన భవనాలకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. కూసుమంచిలో 5ఎకరాల విస్తీర్ణంలో రూ.45కోట్లతో నిర్మించనున్న 100పడకల ఆసుపత్రి నిర్మాణానికి, రూ.162కోట్ల54లక్షలతో మున్నేరు పాలేరు లింక్ కేనాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే25కోట్ల రూపాయలతో 5ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాలను, మద్దులపల్లిలో 23ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 20కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డును ప్రారంభిచారు. అనంతరం నర్సింగ్ కళాశాలలో విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థినిలకు నర్సింగ్ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు...పేద ప్రజలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. సమాజంలో వైద్య రంగానికి అత్యంత విలువ ఉందని, ఆపద సమయంలో ప్రజలు నమ్మకంతో ఆసుపత్రులకు వస్తారని, విధుల నిర్వహనలో చిన్న నిర్లక్ష్యం చూపిన ప్రాణ నష్టం, ఒక కుటుంబం జీవినాధారం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కావున విధి నిర్వహణలో వ్యక్తిగతంగా ఉన్న ఇబ్బందులు, సమస్యలు పక్కన పెట్టాలని అన్నారు. జపాన్, జర్మనీ దక్షినకొరియా పర్యటనలో అక్కడ లక్షలాదిగా నర్సుల కొరత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. జపాన్‌లో ఏజింగ్ సమస్య వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మన నర్సింగ్ విద్యారుథలు అక్కడ సాఫ్టేవేర్ ఇంజనీర్ కంటే ఎక్కువ జీతభత్యాలతో ఉపాధి అవకాశాలు ఉన్నాయని అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వ ఏర్పడిన తర్వాత నిధులు మంజూరు చేసి నర్సింగ్ కళాశాల నిర్మించామని, ఇక్కడ చదివే విద్యార్థినులను దృష్టిలో పెట్టుకొని అవసరమైన అన్ని మౌళిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం నగర మేయర్ పునకొలు నీరజ, అదనపు కలెక్టర్లు డాక్టర్ శ్రీజ, శ్రీనివస్‌రెడ్డి, కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మంపై ఎగసిపడిన ఎర్రకెరటం




- ఎర్ర సముద్రాన్ని తలపించిన భారీ ర్యాలీ
- నయాబజార్ నుంచి సభాస్థలివరకు కదం తొక్కిన కామ్రేడ్స్
- ఆకట్టుకున్న కోలాటాలు, నృత్యాలు, డీజే పాటలు




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం నగరంలో ఆదివారం నిర్వహించిన భారతకమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ల ఉత్సవానికి ఎర్ర సైన్యం తరలివచ్చింది. నాయబజార్ కళాశాల నుంచి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెలపల్లి శ్రీను, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్, బోసు, కలివేని శంకర్, ఆధ్వర్యంలో ప్రారంభమైన ర్యాలీ అరుణవర్ణాన్ని పులుముకుంది. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని రాష్ట్రాలతో పాటు పాలేరునియోజక వర్గానికి చెందిన వారు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు ఎర్ర చీరలు, కామ్రేడ్స్ ఎర్ర చొక్కాలను ధరించి, ఎర్రజెండాలను పట్టుకొని కథం తొక్కారు. ఇక్కడ నుంచి సాగిన ర్యాలీ ఎస్.ఆర్.బిజె.ఎన్.ఆర్‌గ్రౌండ్‌లోని సభ స్థలివరకు పాదయాత్రగా సాగింది. ఆద్యంతం ర్యాలీ జై సిపిఐ లాంగ్‌లీవ్ లాంగ్‌లీవ్ అంటూ నినాదాలతో రహదారి హోరెత్తింది. భారీగా తరలివచ్చిన ర్యాలీతో పులుముకున్న అరుణవర్ణం సాక్షిగా ఎర్ర సముద్రాన్ని తలపించింది. అలాగే వరంగల్‌క్రాస్‌రోడ్డు నుంచి పెద్ద ఎత్తున్న ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సీఓటు ఆక్సీజన్ పేపర్ బ్లాస్ట్ ద్వారా ఎరుపుమయం చేశారు. ఈ నేపథ్యంలో డీజే పాటలు, కోలాటాల నడుమ కామ్రేడ్స్ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే సముద్రాన్ని తలపించేలా తరలివస్తున్న ర్యాలీని బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాదారులు, రోడ్లపై ఉన్నవారు, నివాసితులు తమ సెల్‌ఫోన్లలో ఫోటోలు తీసుకున్నారు. దిక్కులు పిక్కటిల్లేలా సాగిన ప్రదర్శనతో కమ్యూనిస్టులు తమ బలాన్ని చాటుకున్నారనే చెప్పాలి.

## సిపిఐ శత వసంత సభకు తరలిన సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శత వసంతాల బహిరంగ సభకు సత్తుపల్లి నుండి సిపిఐ శ్రేణులు ఆదివారం భారీగా కదలి వెళ్లారు. ముందుగా వెంగళరావు నగర్ శాఖ ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని సిపిఐ పట్టణ నాయకులు కాగితం వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వందల ఏళ్ళ ముగింపు ఉత్సవాల్లో పాల్గొనే ముందు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఖమ్మం పట్టణంలో నిర్వహించే భారీ ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సత్తుపల్లి మండల పార్టీ కార్యదర్శి తడికమళ్ళ యోబు, సిపిఐ నాయకులు తెలగారపు రామారావు, షేక్ రహిమతుల్లా, కోలేటి వెంకటేశ్వరరావు, నరసింహారావు, ఎర్రజాల రాజశేఖర్, ఏఐటియుసి నాయకులు దార భీమయ్య, మధు, ఏఐటీయూసీ సత్తుపల్లి మండల అధ్యక్షులు కర్నాటి బసవయ్య, కె వెంకమ్మ, కమల, పొదిలి జయమ్మ, రాజ్యలక్ష్మి , రత్నమాల, పరస కృష్ణవేణి, అనసూర్య, నాగలక్ష్మి , సుజాత, సీతమ్మ, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌టిఆర్ 30వ వర్ధంతి





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎన్‌టిఆర్ 30వ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డా॥ వాసిరెడ్డి రామనాథం, ఖమ్మం ఇంచార్జి కూరపాటి వెంకటేశ్వర్లు, అడహాక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, వడ్డెం విజయ్ తదితరులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానీయుడు ఎన్‌టిఆర్ అన్నారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడైన ఎన్‌టిఆర్ సుపరిపాలన సాగించారన్నారు. తెలుగు వారి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహానీయుడు ఎన్‌టిఆర్ అన్నారు. ఆయన భౌతికంగా మన మధ్యలో లేకపోయినా ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా సీతయ్య, వనమా వాసు, కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా లకారం ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సిహెచ్ రవికిరణ్, పగడాల నాగరాజు, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే..

### టిడిపి కొణిజర్ల మండల అధ్యక్షుడు తాతా సుధాకర్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఉమ్మడి ప్రదేశ్ రాష్ట్రంలో పేదలకోసం మొట్ట మొదటిసారి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు కే దక్కుతుందని టిడిపి కొణిజర్ల మండల అధ్యక్షుడు తాతా సుధకార్ అన్నారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమం మండల కేంద్రం కొణిజర్ల తోపాటు అమ్మపాలెం , పెద్దగోపతి , అనంతారం చిన్నమునగాల , పెద్ద మునగాల , రెడ్డిగూడెం , తీగలబంజర తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతు బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి రాజకీయానికి కొత్త అర్థం చెప్పి సమాజమే దేవాలయం , ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. నిరంతరం ఆయన పేదరిక నిర్మూలనకే అధిక ప్రాతాన్యతనిచ్చారని మహిళలకు సముచిత గౌవరం ఆయన వల్లే కలిగిందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతోనే ప్రజలకు న్యాయం జరిగిందని నిరుపేదలకు ఇళ్లు కట్టించిన ఘనత ఆయన సొంతం అని అన్నారు. ఇప్పటికి ఎప్పటికి మరిచిపోలేని వ్యక్తి ఎన్టీరామారావు అని అన్నారు. అనంతరం ప్రజలకు పండ్లు , స్వీట్లు , పులిహోర పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో ఎస్‌కె సైదులు ,శ్రీనివాసరావు, , దామా శ్రీనివాసరావు , దానియేలు , గోస్ హమాన్, చింతనిప్పు నరసింహారావు , కొమ్మిన్ని సత్యం, చిట్టి శ్రీను, ఎస్ కె జమాల్ , వాంకుడోత్ సీతారాములు , కోసూరి సత్యం , చింతల మురళి, రామమల్లయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, ఏనాటి వెంకన్న, బొల్లం రామారావు, తుప్పతి బీరయ్య, ఒగ్గు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలిన సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు సిపిఐ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ఖమ్మం నగరంలోని కొత్తగూడెం సిపిఐ శాఖ, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగిన ముగింపు బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, 15వ డివిజన్ కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు భారీగా తరలిన సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/ చింతకాని :** భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు బహిరంగ సభకు చింతకాని మండల వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. వంద మంది జనసేవాదళ్ కవాతు బృందం, 10 మంది రైతులు, మహిళా సంఘాల నాయకులు పెవిలియన్ గ్రౌండ్ నుంచి సాగిన ప్రదర్శనలో పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహించి ఖమ్మం చేరుకున్నారు. 50 బస్సులు, 400 బైకులు, 30 టాటా ఏసిలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో కార్యకర్తలు సుమారు నాలుగువేల మందికి పైగా బహిరంగ సభకు హాజరయ్యారు.

## సిపిఐ సభకు ఉచిత మాస్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాల ముగింపు సభ సందర్భంగా మగువ హోమ్ ఫుడ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. ఆదివారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవనం వద్ద మగువ హోమ్ ఫుడ్స్ ఆధ్వర్యంలో సిపిఐ శ్రేణులకు ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. హోమ్ ఫుడ్స్ నిర్వాహకులు తాటి నాగమణి, శ్వేత, సిపిఐ ఖమ్మం కార్పోరేషన్ ఫ్లోర్ లీడర్ బిజి క్లెమెంట్, ప్రజాపక్షం ఖమ్మం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా మాస్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నకిరికంటి కృష్ణ, మహేష్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ సర్కిల్‌నుంచి ఉత్సాహపూరితంగా సిపిఐ ర్యాలీ

### ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం





**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్న సభకు సిపిఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి ఎస్‌కె జానిమియా, తోట రామాంజనేయులు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన సభకు కొణిజర్ల, వైరా, తల్లాడ, సత్తుపల్లి, మధిర తోపాటు తదితర గ్రామాలనుంచి వచ్చిన వేలాది మంది సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శ్రీశ్రీ సర్కిల్‌నుంచి ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో సభాప్రాంగణానికి పాదయాత్రద్వారా తరలివచ్చారు. సిపిఐ నినాదాలతో ఎర్రజెండాలతో కదంతొక్కి నడుచుకుంటు వచ్చారు. కిలోమీటర్ల కొద్ది ఎర్రచొక్కాలు, ఎర్రచీరలతో రోడ్లు మొత్తం ఎరుపువర్ణంగా మారిపోయింది. డిజేతో సిపిఐ పాటలతో సభాప్రాంగణానికి చేరుకున్నారు. వారికి ముందు చిన్నరుల కోలాటనృత్యం ఎంతో ఆకట్టుకుంది. కార్యకర్తలను వరుసక్రమంలో నడిపించడానికి వాలంటీర్లు ఎంతో శ్రమించవలసి వచ్చింది.

## వాడవాడలా ఎన్‌టిఆర్ వర్ధంతి





**ప్రజాపక్షం/ చింతకాని :** తెలుగు ప్రజల ఆరాధ్యుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి చింతకాని మండల వ్యాప్తంగా వాడవాడల ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పరిధిలోని లచ్చగూడెంలో జరిగిన కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి గురిజాల హన్మంతరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారాస ఆధ్వర్యంలో తిరుమలాపురంలో ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. చింతకాని మండల కేంద్రంలో సాయంత్రం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్‌టిఆర్ నటించిన సినీ గేయాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, టిడిపి మండల కార్యదర్శి నన్నక రామారావు, సీనియర్ నాయకులు నన్నక గోపాలరావు, చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్‌బాబు, మల్లెల సత్యనారాయణ,బండిప్రసాద్ పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ దృశ్యమాలిక



# ఖరీదైన వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయం

## వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్





**ప్రజాపక్షం/వైరా:** ఖరీదైన వైద్య పరీక్షలు వైరా నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకొని రావడం ఎంతో అభినందనీయమని కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కొల్లి కల్పనాచౌదరిని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అభినందించారు. వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొల్లి ఫౌండేషన్ టీం విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో నిర్వహించిన జీర్ణ వ్యవస్థ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ఆదివారం అనూహ్య స్పందన లభించింది. 300 మంది ప్రజలు ఈ ఉచిత పరక్షీలను సద్విని యోగం చేసుకున్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వాహకులు టీం విమలాకర్, ఫౌండేషన్ కొల్లి ఫౌండేషన్ వారిని అభినందించారు. అంతేకాకంపడా వైరా ఎమ్మెల్యే తాను సైతం పరీక్షలు చేయించుకున్నారు. కార్పొరేట్ వైద్య పరీక్షలు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించడం, పేద ప్రజల ఆరోగ్యంపై ఆ ఫౌండేషన్‌లకు ఉన్నా అపారమైన ప్రేమ అభిమానాలకు తార్కానంగా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు. ఎంతో వ్యయప్రయాసలతో కూడిన ఈ కార్యక్రమం నిర్వహణ భాగంగా భావించకుండా ఎంతో అంకితభావంతో కృషి చేయడం పట్ల సమాజ సేవపై వారికున్న చిత్తశుద్ధిని చాటి చెప్పిందన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో జీర్ణ వ్యవస్థకు సంబంధించి అల్ట్రా సౌండ్ అబ్డోమెన్ యుజిఐ ఎండోస్కోపి, లివర్ ఫంక్షన్ టెస్ట్, ప్రోక్టో స్కోపి, ఫైబ్రో, స్కాన్, 2 డి, ఎకో, సిబిపి, సీరమ్, క్రియాటినిన్, ఆర్‌బిఎస్, లిపిడ్ ప్రొఫైల్, మెచ్‌బిఎస్‌ఏజి హెచ్‌సివి టెస్ట్‌లను ఉచితంగా చేయడం జరిగింది. ఉదయం 7.30 గంటల నుండి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగింది. ఈ కార్యక్రమంలో కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కొల్లి కల్పనాచౌదరి, డాక్టర్ విమలాకర్‌రెడ్డి, డాక్టర్ గౌరంగ్ ప్రాఫ్, డాక్టర్ రాజు ముషమ్, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ జయంత్, డాక్టర్ అనురాగ్, డాక్టర్ గపాల్, తేజ, గిరి, రాజేష్, సందీప్, లోహిత్‌లతో పాటు తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నయాకులు పొదిల హరినాధ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, సూతకాని జైపాల్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వైరా ఎస్సై పుప్పాల రామారావు, నందిగామ మనోహర్, గుగులోతు రూప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ వందేళ్ల సభకు భారీగా తరలిన సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భారత కమ్యూనిస్టు పార్టీ 100 ఏళ్ల ఉత్సవ సభకు సత్తుపల్లి నియోజకవర్గం నుండి మూడువేల మందిని తరలించడం జరిగిందని ఇట్టి సభకు హాజరైన కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సభ్యులు, సానుభూతిపరులు, ప్రజా సంఘాల నాయకులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ తెలిపారు. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల నుండి సుమారు 20 బస్సులు ఆటోలు టాటా మ్యాజిక్ ద్వారా ప్రజలను తరలించినట్టు దండు తెలిపారు. ఈ సభకు నియోజవర్గ నాయకులు అందరూ శ్రమించి ఈ బహిరంగ సభను జయప్రదం చేశారని సత్తుపల్లి మండల కార్యదర్శి యోబు, పట్టణ కార్యదర్శి నెంబర్ రామకృష్ణ పట్టణ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ రంజాన్ బి, వేంసూర్ మండల కార్యదర్శి రామలక్ష్మి, సింగ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు సముద్రాల సుధాకర్, భీమయ్య నరసింహారావు, చారి, వెంకటేశ్వర్లు, పెనుబల్లి మండల కార్యదర్శి సుధాకర్, కల్లూరు సిపిఐ నాయకులు వేము రాంబాబు, మండల కార్యదర్శి దయాకర్, తల్లాడ నాయకులు ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రావణ్, తల్లాడ మండల కార్యదర్శి ఓర్సు రమేష్, రైతు సంఘం నాయకులు నల్లమోతు నరసింహారావు, వెంకటేశ్వర్లు, ఇంకా సత్తుపల్లి మధ్యాహ్న భోజన వర్కర్ సీనియర్ నాయకులు, వేంసూరు మధ్యాహ్న భోజన వర్కర్ సీనియర్ నాయకులు సత్తుపల్లి వ్యాపారులు ఆటో యూనియన్ నాయకులు కేశవరావు, సత్తుపల్లి మండల నాయకులు తాటి వీరభద్రం, దండు జగ,న్ టౌన్ కమిటీ నాయకులు పోలేటి వెంకటేశ్వర్లు, రామారావు అనేక మంది నాయకులు కార్యకర్తలు బహిరంగ సభ జయప్రదాయాన్ని కృషి చేశారని వారితో పాటు బహిరంగ సభకు సహకరించిన బస్సులు స్పాన్సర్ చేసిన స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో మరింత పటిష్టమైన పోరాటం నిర్వహించడానికి ఈ బహిరంగ సభ ఉపయోగపడుతుందని ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కామ్రేడ్ డి రాజా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఉపన్యాసం ప్రజాస్వామ్య పోరాటాలకు ఊపునిచ్చే విధంగా ఉందని రానున్న కాలంలో రాజ్యాంగ రక్షణ కోసం ప్రజాస్వా మ్య పరిరక్షణ కోసం లౌకికవాద రక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించుకున్నట్లు దండు ఆదినారాయణ తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక




**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి హైస్కూల్‌లో 198889 సంవత్సరంలో పదోవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కామేపల్లి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంను పూర్వ విద్యార్థులు ఖమ్మం శశి ఆసుపత్రి నిర్వాహకులు దమ్మాలపాటి శ్రీనివాసరావు కోఆర్డినేషన్‌తో నిర్వహించారు. ఈసందర్భంగా గురువులు బాలరాజు, రామచంద్రరావులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఒకే తరగతిలో 65 మంది విద్యార్థులతో పదో తరగతి చదువుకున్నామని, 36 సంవత్సరాల తరువాత అందరం కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దమ్మాలపాటి శ్రీనివాసరావు, పాశం శ్రీనివాసరావు, దీవెల కోటేశ్వరరావు, గుజ్జర్లపూడి రాంబాబు, ప్రకాష్, బండి నర్సింహారావు, కొర్ర రాములు, పెంటు, సరోజినీ, వీరితో పాటు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేదవారి గుండెల్లో చెరగని ముద్ర ఎన్‌టిఆర్



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** పేద వారి గుండెల్లో చెరగని ముద్ర ఎన్టీఆర్ అని టిఎన్‌టియూసి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త పోటు రంగారావు కొనియాడారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా సారపాకలో నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలలోనే అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా బీసీ బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించి భారతదేశంలోనే మొట్ట మొదటి సారిగా ఆదర్శవంతమైన నిర్ణయాలతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం ఐటిసి పిఎస్‌పిడి టిఎన్‌టియూసి గుర్తింపు సంఘం అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్ మాట్లాడుతూ పేదవారికి రెండు రూపాయలకే కిలో బియ్యం, మహిళలకు ఆస్తి హక్కు, పటేలు పట్వారి వ్యవస్థ రద్దు చేయడం, వృద్ధులకు చీర దోతి పథకం, పక్కా గృహ నిర్మాణం, రైతులకు ఉచిత విద్యుత్, విద్యా, వైద్యపరంగా పరిపాలన గ్రామాలలో ప్రతి పౌరుడికి చేరే విధంగా సంస్కరణలు చేపట్టి భారతదేశంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న అన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం 12గంటలకు సారపాక సెంటర్‌లో అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తాళ్లూరి జగదీశ్వర్‌రావు, రాష్ట్ర టిఎన్‌టియూసి ప్రచార కార్యదర్శి గల్లా నాగభూషయ్య, సారపాక మేజర్ గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్, కోయగూడెం సర్పంచ్ కొండమ్మ, కొండలరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కంచేటి వెఉంకటేశ్వరరావు, కాకర్ల సత్యనారాయణ, సుబ్బారావు, టిఎన్‌టియుసి కార్యవర్గ సభ్యులు కరి రాజేంద్రప్రసాద్, జీవన్‌రెడ్డి, కుందేటి శ్రీనివాసరావు, సంజీవరావు, నాగూర్ వలి, రామ్ కిషోర్, పిడుగు కొండలరావు, బండారి సత్యనారాయణ, పోటు నరేష్, కార్యవర్గం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పర్యటన

**ప్రజాపక్షం/ చింతకాని :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం చింతకాని మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వందనం, కోదుమూరు రెండవ దశ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు రూ.35.75 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం వందనం, పుట్టకోట జెడ్పి రోడ్డు రూ.3.5కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వందనం ఎస్సి కాలనీ రూ.1.85 కోట్లతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు నేడొక ప్రకటనలో తెలిపారు.

## సిపిఐ శత వసంత సభకు తరలిన సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/కల్లూరు:** ఖమ్మంలో సిపిఐ శత వసంత ముగింపు సభకు కల్లూరు సిపిఐ శ్రేణులు కార్మిక సంఘాలు ఆదివారం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేణు రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు ల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంఘాలకు వెన్నంటి ఉన్న ఉంటున్నది ఎర్రజెండా పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జొన్నలగడ్డ కుమారి, అనూష, మధ్యాహ్న భోజన మధ్యాహ్న భోజనం సంఘ నాయకులు వెంకటలక్ష్మి, పాఠశాల స్వీపర్ల సంఘ నాయకులు మలేఖ, రేణుక, కమలమ్మ ఆసుపత్రి కార్మిక సంఘ నాయకులు మున్సిపాలిటీ సంఘ నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి



**ప్రజాపక్షం/మధిర :** తెలుగు జాతి ఆత్మ గౌరవ పతాకం, విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, మహానాయకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం వర్ధంతి కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే గేటు వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర టిడిపి నాయకులు చేకూరి శేఖర్‌బాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లాది హన్మంతరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మార్నిడి పుల్లారావు, మేడ వెంకటేశ్వరరావు, గడ్డం రమేష్, మల్లికార్జున్, వాసిరెడ్డి శివాజీ, చేకూరి కృష్ణారావు, యడవల్లి శ్రీధర్, మైనిడి జగన్మోహన్‌రావు, ములకలపల్లి వినయ్, పత్తిపాటి కృష్ణారావు, వంశీ పాల్గొన్నారు.

## వైరాలో ఎన్‌టిఆర్ వర్ధంతి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎన్టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పలువురు నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలుగుదేశం కార్యాలయంలో వైరా మండల అధ్యక్షులు కిలారి సురేందర్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా మండల కార్యదర్శి గాలి రామకృష్ణ, వైరా పట్టణ అధ్యక్షులు బొల్లేపల్లి శ్రీనివాసరావు, గడ్డ నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ మాజీ ఇంచార్జి చెరుకూరి చలపతిరావు, సీనియర్ నాయకుల మోతుకూరి వెంకటేశ్వరరావు, మందడలపూడి మధుసూదన్‌రావు, అర్జున్‌రావు, సతీష్, మాజీ పట్టణ అధ్యక్షులు ప్రతీపు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## సంచార కుటుంబాలకు దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్డులో ప్రముఖ సంఘ సేవకుడు, ఆశా మిత్ర లంకా కొండయ్య ఇంటి వద్ద మహాత్మా గాంధీ ఉచిత బట్టల కేంద్రం ద్వారా ఆదివారం సంచార కుటుంబాలకు ఉచితంగా పాత బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో దాతల సహకారంతో పాత బట్టలను సేకరించి నిరుపేదలకు పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. వేరే రాష్ట్రాల నుండి కూలీ పనులకు వచ్చిన సంచార కుటుంబాలకు సేవా దృక్పథంతో పాత బట్టలను పంపిణీ చేయటం జరిగిందని, సమాజ సేవలో తమవంతుగా సహాయం చేస్తున్న దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిఒక్కరూ సేవాభావంతో ఎదుటి వారికి తమకు తోచిన విధంగా సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంకా ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బహిరంగ సభకు తరలిన శ్రేణులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మంలో జరగనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మాదారం గ్రామం శాఖ నుండి వందల మంది కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లిన నేపథ్యంలో కాంగ్రెస్ నేత మాదారం సర్పంచ్ ఉమా నరేష్ మాట్లాడుతూ దేశ రక్షణలో కమ్యూనిస్టుల భాగస్వా మ్యం చాలా అవసరమని ఎంతో మంది మహనీయులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని, వారి చరిత్ర రానున్న కాలానికి తెలియజేసే విధంగా ఇటువంటి శతాబ్ది ఉత్సవాలు జరపడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాపిని సత్యనారాయణ, సమదేవ్, పోతనబోయిన రవి, ఎస్‌కే జానీ, రామారావు, బట్టు లింగయ్య, దుప్పటి గోవిందు, అజ్మీర బాలాజీ, వి భారతి, సోమల, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శత వసంత ఉత్సవ ముగింపు సభకు పోటెత్తిన ఎర్రదండు







**-జిల్లా నలుమూలల నుండి సైనికుల్లా కదిలిన ఎర్రసైన్యం**
**-ఖమ్మం నగరం దిక్కులు పిక్కటిల్లేలా కవాత్**
**-శత వసంతం మురిసేలా నూతన ఉత్సాహం**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శత వసంత ఉత్సవ ముగింపు సభకు జిల్లా నలుమూలల నుండి ఎర్రసైన్యం దండులా కదిలింది. భద్రాచలం నియోజకవర్గం చర్ల మండలం నుండి మొదలుకొని జిల్లాలోని ఐదు నియోజకవర్గాల వ్యాప్తంగా గ్రామ గ్రామాన ఎర్ర సైనికులు ఖమ్మం నగరానికి కదిలారు. ఉదయభానుని లేలేత కిరణాలు ప్రపంచాన్ని చుట్టు ముడుతుండగా జనసేవా దళ్ రెడ్ షర్ట్, రెడ్ డ్రెస్, రెడ్ శారీ వాలంటీర్లు కథనరంగ ఉత్సాహంతో ఖమ్మం వేదిక వైపు కదం తొక్కారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లందు, అశ్వారావుపేట నియోజకవర్గాల పరిధి నుండి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున శత వసంత ఉత్సవ ముగింపు సభకు ఉత్సాహంగా ముందుకు సాగారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి వేలాది వాహనాల్లో సుమారు లక్ష మంది శత వసంత ఉత్సవ ముగింపు సభలో మేము సైతం అంటూ హాజరై పిడికిలి బిగించారు. సభా ప్రాంగణం వద్ద ప్రపంచదేశాల కమ్యూనిస్టు ప్రతినిధులు భారత గడ్డపై 100 ఏళ్ళ సంబురాన్ని పంచుకుంటున్న తరుణంలో నూతన ఉత్సాహం ఉరకలేసింది. శత వసంతాల భారత కమ్యూనిస్టు పార్టీలో తాము సైతం సభ్యులమే అంటూ రెట్టింపు ఉత్సాహంతో చేసిన నినాదాలు మిన్నంటాయి. ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా పార్టీ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాటు చేశారు. మండల పట్టణ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులను సన్నద్ధం చేసి ఉత్సవ సంబరానికి తరలించారు. ఖమ్మం నగరం దిక్కులు పిక్కటిల్లేలా సాగిన శత వసంత ముగింపు సభ జిల్లా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నిప్పింది. త్యాగాలు, పోరాటాలు, ప్రాణతర్పణాలతో మమేకమై వందేళ్లు పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజాక్షేత్రంలో మరో వందేళ్లు కూడా మనగలదని నమ్మకాన్ని కలిగించింది. ప్రజా పోరాటాలు ఉద్యమాలే పార్టీకి బలమని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం కొనసాగిన సిపిఐ శత వసంత జైత్ర యాత్ర ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు, మరింత అరుణ వర్ణమై ముందుకు సాగాలని అంతా కోరుకుంటున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబీర్ పాషా ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మిర్యాల రంగయ్య, రెడ్డి పుల్లారెడ్డి, మున్న లక్ష్మి కుమారి, నరాటి ప్రసాద్, ఎస్ డి సలీం, చంద్రగిరి శ్రీనివాసరావు, కే. సారయ్య, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, డి శంకర్, బందం నాగయ్య, కమటం వెంకటేశ్వరరావు, జి వీరస్వామి, వై ఉదయభాస్కర్, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, బి పూర్ణచంద్రరావు, ఏ సాయిబాబు, యు రాహుల్, ఎస్కె ఫహీం తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు నుండి భారీగా తరలిన ఎస్సీడబ్ల్యూయు, ఏఐటియూసి శ్రేణులు

**ప్రజాపక్షం/మణుగూరు:** భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు మణుగూరు ప్రాంతం నుండి ఏఐటియూసి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. ఈ ప్రదర్శనకు ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్ నాయకత్వం వహించారు. మణుగూరు నుండి ప్రత్యేక వాహనాల్లో ఎర్ర జెండాలు పట్టుకుని, నినాదాలు చేస్తూ కార్మిక శ్రేణులు ఉత్సాహంగా బయలుదేరివెళ్ళారు. 100 ఏళ్ల పోరాట పటిమను చాటి చెప్పేలా, కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఈ చలో ఖమ్మం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాంగోపాల్ పిలుపునిచ్చారు. శత జయంతి ఉత్సవాల బహిరంగ సభకు బయలుదేరిన వారిలో వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రామ నరసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీ జి. పుల్లారావు, ఆఫీసు బేరర్లు ఆవుల నాగరాజు, గోలి గంగాధర్ రావు, ఆదర్ల సురేందర్, బి.సురేంద




ర్రావు, ఫిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, గుంపెన శ్రీనివాసరావు, ఆంథోని రవికుమార్, సాయి ప్రకాష్ చారి, రత్నం శివకుమార్, ఎగ్జిక్యూటివ్ నెంబర్స్, కౌన్సిల్ నెంబర్స్, సేఫ్టీచ మైన్స్ కమిటీ మెంబర్స్ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలో గల స్థానిక గిరిజన బాలుర హాస్టల్ నందు శనివారం గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో వసతి గృహ సంక్షేమ అధికారులకు, ప్రధానోపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా డిప్యూటీ డైరెక్టర్ నారీ విజయలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాలలో నిర్వహించాల్సిన రికార్డుల ప్రాముఖ్యత, నిబంధనల ప్రకారం నిర్వహణ విధానం, పర్యవేక్షణ అంశాలపై విస్తృతంగా అవగాహన కలిగి ఉండాలని, త్వరలో జరిగే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. తదనంతరం రికార్డుల నిర్వహణపై నిపుణులచే శిక్షణ ఇప్పించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఖమ్మం ఏటీడీవో సత్యవతి, వైరా ఐటీడీవో ఏసీఎంఓ, స్థానిక వసతి గృహ సంక్షేమ అధికారి కే తిరుపతిరావు, గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టిఆర్ 30వ వర్ధంతి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) మరణించి జనవరి 18 నాటికి 30 ఏళ్లు అవుతుంది. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు, తెలుగు తమ్ముళ్లు, అభిమానులు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన ఆశయాలు, స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, నియోజకవర్గం నాయకులు లకావత్ గిరిబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ అనేది ఒక చరిత్ర అని, తెలుగు ప్రజల ఆత్మ గౌరవని ప్రపంచానికి చాటి చెప్పిన మహా నాయకుడు ఎన్టీఆర్ అని సంక్షేమ పథకాలకు అధ్యుడు ఎన్టీ రామారావుని ఈరోజు తెలుగు రాష్ట్రాల్లో కాదు భారతదేశ మొత్తం ఆయన మొదలుపెట్టిన పథకాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఎన్టీఆర్ చూపించిన మార్గంలోనే ప్రజలు ముందుకు నడుస్తున్నారని, రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ బలమైన శక్తిగా ఎదిగి ఈ రాష్ట్రంలో కీలకంగా మారుతుందని ఈ సందర్భంగా వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## శతాబ్ది ముగింపు సభకు తరలిన సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/మణుగూరు:** సిపిఐ పార్టీ శత జయంతి ముగింపు వేడుకలు ఖమ్మం నగరంలో ఆదివారం యిదు లక్షల మందితో జరిగిన బహిరంగ సభకు మణుగూరు మండలం, పట్టణం నుండి సుమారు 30 బస్సులు, 15 కార్లు ట్రాలీలు తో పెద్ద ఎత్తున జన సమీకరణతో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు ప్రజాసంఘాల బాధ్యులు ఖమ్మం బయలుదేరి వెళ్ళారు.

## సిపిఐ సభకు భారీగా తరలిన శ్రేణులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సిపిఐ శత వసంత ముగింపును పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత స్థాయి బహిరంగ సభకు బూర్గంపాడు మండలం నుంచి సిపిఐ కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు. పార్టీ జెండాలు, నినాదాలతో ఉత్సాహంగా ఖమ్మం వైపు తరలిన కార్యకర్తలు సిపిఐ శతాబ్ది వేడుకలను విజయవంతం చేయాలనే సంకల్పంతో పాల్గొన్నారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డా), సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, సిపిఐ మండల కార్యదర్శి సప్కా నాగేశ్వరరావులు మాట్లాడుతూ దేశంలో కార్మికులు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ ఆవిర్భావం నుంచి నిరంతర పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు, గ్రామ శాఖల కార్యదర్శులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సభకు భారీగా తరలిన శ్రేణులు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సీపీఐ 100వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత స్థాయి బహిరంగ సభకు జూలూరుపాడు మండలం నుంచి సీపీఐ కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు. పార్టీ జెండాలు, నినాదాలతో ఉత్సాహంగా ఖమ్మం వైపు తరలిన కార్యకర్తలు సీపీఐ శతాబ్ది వేడుకలను విజయవంతం చేయాలనే సంకల్పంతో పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, జూలూరుపాడు మండల సీపీఐ కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో కార్మికులు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ ఆవిర్భావం నుంచి నిరంతర పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు, మండల సహాయకార్యదర్శి షేక్ నాగులు మీరా, ఏ ఐ వై ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ చాంద్ పాషా, సీపీఐ మండల నాయకులు, గ్రామ శాఖల కార్యదర్శులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సభకు భారీగా తరలిన శ్రేణులు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** సిపిఐ శత వసంత ముగింపును పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత స్థాయి బహిరంగ సభకు అశ్వాపురం మండలం నుంచి సిపిఐ కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు. పార్టీ జెండాలు, నినాదాలతో ఉత్సాహంగా ఖమ్మం వైపు తరలిన కార్యకర్తలు సిపిఐ శతాబ్ది వేడుకలను విజయవంతం చేయాలనే సంకల్పంతో పాల్గొన్నారు. ఈసందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ మాట్లాడుతూ ఖమ్మంలో నిర్వహించనున్న అఖిల భారత స్థాయి బహిరంగ సభ సిపిఐ శతాబ్ది ఉద్యమాల్లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని, ఈ సభ ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాటాలకు దిశా నిర్దేశం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడమే ఈ సభ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు, గ్రామ శాఖల కార్యదర్శులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శత వసంత సభకు తరలిన ఎర్రదండు





**ప్రజాపక్షం/చంద్రుగొండ:** సిపిఐ శత వసంత ముగింపును పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత స్థాయి బహిరంగ సభకు చంద్రుగొండ మండలం నుంచి సిపిఐ కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు. పార్టీ జెండాలు, నినాదాలతో ఉత్సాహంగా ఖమ్మం వైపు తరలిన కార్యకర్తలు సిపిఐ శతాబ్ది వేడుకలను విజయవంతం చేయాలనే సంకల్పంతో పాల్గొన్నారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు గార్లపాటి రామనాథం మాట్లాడుతూ ఖమ్మంలో నిర్వహించనున్న అఖిల భారత స్థాయి బహిరంగ సభ సిపిఐ శతాబ్ది ఉద్యమాల్లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని, ఈ సభ ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాటాలకు దిశానిర్దేశం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడమే ఈ సభ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బొర్రా కేశవలు, సీతాయిగూడెం సర్పంచ్ రామ లక్ష్మయ్య, నాయకులు జడ శ్రీను, గంగుల లక్ష్మీనారాయణ మండల నాయకులు, గ్రామ శాఖల కార్యదర్శులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరుపెక్కిన ఖమ్మం

**-కదం తొక్కిన రెడ్‌షర్ట్ వాలంటీర్లు**
**-ఆకట్టుకున్న జనసేవాదళ్ కవాత్**













**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ సందర్భంగా ఖమ్మం నగరం ఎరుపెక్కింది. జనసేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాత్‌తో ఖమ్మం నగరం పులకించింది. పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైన కవాత్ ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానం వరకు సాగింది. ఆదివారం సిపిఐ శత వసంతాల ముగింపు సభ సందర్భంగా జనసేవాదళ్ ఆధ్వర్యంలో కవాత్ నిర్వహించారు. ఈ కవాతుకు ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ సీనియర్ నాయకులు చాడా వెంకటరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైన ఈ కవాత్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, గుజ్జుల ఈశ్వరయ్య, చాడ వెంకటరెడ్డి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అగ్రభాగాన ప్రదర్శనలో పాల్గొన్నారు. పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన మయూరిసెంటర్, పాత బస్టాండ్, జెడ్పి సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు, సర్దార్ పటేల్ స్టేడియం మీదుగా బహిరంగ సభ జరిగే ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల మైదానం వరకు కొనసాగింది. కోలాటం, డప్పు, డోలు, బతుకమ్మ, గిరిజన సంప్రదాయ నృత్యాలు ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. వేలాది మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. రెడ్‌షర్ట్ వాలంటీర్లు ఎర్ర జెండాలను పట్టుకుని నడుస్తుండగా నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రదర్శన జరుగుతున్న దారి పొడవునా ఖమ్మం నగర ప్రజలు పూల వర్షం కురిపిస్తూ నీరాజనాలు పలికారు. జనసేవాదళ్ కవాత్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన రెడ్ షర్ట్ వాలంటీర్లు, సింగరేణి కార్మికులు, రైతు సంఘాల నాయకులు, మహిళా సంఘాల నాయకులు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, వైద్యులు, న్యాయవాదులు, పుర ప్రముఖులు ఈ కవాతులో పాల్గొన్నారు. నాగళ్లు పట్టుకున్న రైతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జనసేవాదళ్ కవాతుకు సిద్దినేని కర్ణకుమార్ నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పర్షపద్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మినారాయణ, పలువురు నాయకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

**-సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డా॥ కె. నారాయణ**




ప్రజాపక్షం/ ఖమ్మం : కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డా॥ కె. నారాయణ విమర్శించారు. ఖమ్మంలో జరిగిన శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ పాల్గొని మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ కార్పొరేట్ల చేతుల్లో ఉందన్నారు. పాలకుల తీరుకు వ్యతిరేకంగా ఉద్యమాలను బలోపేతం చేయాలన్నారు. దేశ ఆర్థిక విధానాలు ప్రజలకు వ్యతిరేకంగా మారుతున్నాయని వాటిని ఎదుర్కోవడానికి సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ ఆవిర్భావం నుంచి దేశంలోని సంస్కరణలు, ప్రజా హక్కుల కోసం పోరాడుతూ ప్రజల పక్షాన అండగా నిలుస్తుందన్నారు. సమ్మక్క సారలమ్మలను దేవతలుగా మాత్రమే చూడకూడదని వారు ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన వీర వనితలని నారాయణరావు పేర్కొన్నారు. గిరిజన హక్కుల కోసం సాగిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. నేటి పరిస్థితుల్లో కూడా ఆదివాసీల, పేదలు, శ్రామికుల సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని వాటి పరిష్కారానికి సంఘటిత పోరాటాలే అవసరమన్నారు. సహజ వనరులు, జీవనాధారాలను కాపాడుకునేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజా ఉద్యమాల ద్వారానే మార్పు సాధ్యమన్నారు. న్యాయ పరమైన పోరాటాల కోసం ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

## కమ్యూనిస్టు పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతుంది..

**-నల్గొండ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి**




**ప్రజాపక్షం/ఖమ్మం:** వందేళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేకున్నా కొనసాగుతుందంటే ప్రజల్లో ఉన్న విశ్వాసమే కారణమని నల్గొండ జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తెలిపారు. ఖమ్మంలో ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశానికి, ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ అవసరమనే భావన మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అధికారమే లక్ష్యంగా పనిచేసే అనేక పార్టీలు అధికారాన్ని కోల్పోయి కనుమరుగవుతున్నాయని కానీ సిద్ధాంతం, నిబద్ధత ఉన్న కమ్యూనిస్టు పార్టీ ప్రజల మధ్యనే కొనసాగుతుందన్నారు. కార్మికులు, రైతులు, విద్యార్థుల హక్కుల పట్ల సాగిన పోరాటాలే పార్టీ బలానికి ఆధారమన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో దేశంలో ఏ ఒక్క పార్టీకి సంపూర్ణ మెజార్టీ వచ్చే పరిస్థితి లేదన్నారు. అవకాశవాద రాజకీయాలతోనే బిజెపి అధికారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తుందని ఆయన విమర్శించారు. మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తూ ప్రజలను విభజిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికే ముప్పుగా మారుతుందని గుర్తించాలన్నారు. ఎర్రజెండా ఉద్యమాలతోనే రైతు, కార్మిక, విద్యార్థుల హక్కుల సాధన సాధ్యమైందని గుర్తు చేశారు. వామపక్షాల ఐక్యత దేశంలో అత్యవసరమని ప్రజాస్వామ్యవాద పార్టీల మద్దతు మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా వామపక్ష పార్టీలు సదస్సులు నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. బిజెపిని గద్దెదించడమే లక్ష్యంగా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.